**3-87**

## మున్నుడి

శ్రీరంగంలో వెలసిన రంగనాధస్వామిపై అన్నమాచార్యులు చెప్పిన అమరమైన సంకీర్తన ఇది. స్వామిని శ్రీరంగ శిశువని కీర్తిస్తున్నారు. నాలుగు వేదములూ నాలుగు తాళ్ళులాగా కట్టుబడిన వుయ్యాలలో ఆదిశేషుడు తొట్టిగా అమర్చబడిన చక్కటి వూయలలో వూగుతున్నాడు. ఆ చక్కటి నల్లని శిశువు. వాడే శ్రీదేవితో కలిసి వేంకటాద్రిపై సేద తీరుతున్నాడట. ఆ శ్రీరంగ శిశువు కమలభవాండమను (బ్రహ్మాండమను) తొట్టిలో బ్రహ్మాండమైన నీటి తరంగాలలో వూపుతుండగా స్థిరమైన సిరులతో వూగుతున్నాడట.

**ఉ॥ తొల్లిట మఱ్ఱియాకుపయి తోయజనాభుడు చిన్నిపాపగా**
**చెల్లుబడై తనూగెనట చిత్రముగా నొక తొట్టెయట్లుగా**
**నల్లని రంగనాయకుని నాణ్యత గొల్చెను అన్నమార్యుడన్**
**చల్లటి మాటగా శిశువు చక్కటి వేంకటనాథుడంచనెన్**

**రాగం : రాగమాలిక**

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూగె గన
చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

కలికి కావేరి తరగల బాహు లతలనే
తలగకిటు రంగమధ్యపు తొట్టెలన్
పలుమారు తను జూచి పాడగా గీని
చిలుపాల సెలవితో శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

అదివో కమలజుని తిరువారాధనం బనగ
అదన కమలభవాండమను తొట్టెలన్
ఉదధులు తరంగముల నూచగా నూగీని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥



15.06.2020



వేదములె చేరులై వెలయంగ శేషుడే
పాదుకొను తొట్టెలై పరగ గాను
శ్రీదేవితో గూడి శ్రీవేంకటేశుడై
సేదదీరెడి వాడె శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

**భావామృతం :**

పూర్వం ఒక మఱ్ఱి ఆకు తొట్టెవలె భాసించి దానిపై శ్రీరంగనాధస్వామి శిశువు వలె వూగినాడు కదా! అట్లు చెల్లుబడియైన ఆ మహానుభావుని కీర్తించెదము.

కావేరీనది కలికివలె (యువతివలె) బాహులతలవంటి తన తరంగములపై నదీ మధ్యమంలో అమర్చబడిన వేదిక అనే తొట్టెలో ఈ శ్రీరంగ శిశువు వూగుచున్నాడు. తనను చూచి అనేక కీర్తనలు పాడుచుండగా, చిలుపాల సెలవితో (చిక్కగా మరగబెట్టిన పాలచారికలు మూతిపై గల) శ్రీరంగ శిశువు వూగుచున్నాడు.

అదిగో కమలభవుని తిరునాళ్ళ సమయంలో బ్రహ్మాండమును ఈ తొట్టెలో, బ్రహ్మాండమైన నీటితరంగములు వూచగా (వూపుతుండగా) చెదరని (స్థిరమైన) సిరిసంపదలతో ఈ శ్రీరంగశిశువు కనుల పండువుగా వూగుచున్నాడు. దర్శించి తరించండి.

చతుర్వేదములైన సామ, ఋక్, యజుర్, అధర్వణ వేదములు నాలుగు చేరులై (కట్టుదు త్రాళ్ళయి) భాసించగా ఆదిశేషుడు చక్కగా అమర్చబడిన తొట్టెయై విలసిల్లగా తనదేవేరి శ్రీదేవితో కూడి తిరుమల శ్రీవేంకటేశ్వరుడై ఈ స్వామియే సేదదీరుచున్నాడు. (విశ్రాంతి తీసుకొనుచున్నాడు) వాడే శ్రీరంగ శిశువైన ఈ శ్రీరంగనాధుడు. ఈ స్వామిని సేవించి మీ జన్మ చరితార్ధం చేసికొనండి.

( నిడురేకులలోని యధ్యాత్మ సంకీర్తనలు )

4-వ రేకు ❋ ఆహిరి

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూఁగెఁగన
చెల్లుబడినూఁగీని శ్రీరంగశిశువు ॥ పల్లవి ॥

కలికి కావేరి తరగల బాహులతలనే
తలఁగకిటు రంగమధ్యపు తొట్టెల
పలుమారుఁ దనునూఁచి పాడఁగానూఁగీని
చిలుపాల సెలవితో శ్రీరంగశిశువు ॥ తొల్లి ॥

అదివో కమలజుని తిరువారాధనంబనఁగ
అదనఁ గమలభవాండమనుతొట్టెల
ఉదధులు తరంగములనూఁచఁగా నూఁగీని
చెదరని సిరులతోడ శ్రీరంగశిశువు ॥ తొల్లి ॥

వేదములె చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీదేవితోఁగూడి శ్రీవేంకటేశుఁడై
సేదదేరెడి వాఁడె శ్రీరంగశిశువు ॥ తొల్లి ॥ 1

❋. ఈ సంకీర్తన 7-వ రేకునను గలదు.